క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ బుక్స్ ఆవిష్కరణ

గుడివాడ టౌన్: 10వ తరగతి పరీక్షల్లో విజయాలు సాధించాలంటే విద్యార్థులకు అవసరమైన పరిజ్ఞానం అందించాలని జిల్లా విద్యాశాకాధికారి పీవీజే రామారావు అన్నారు. సోమవారం స్థానిక డీవైఈఓ కార్యాలయంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో తయారుచేసిన 10వ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఈఓ ఐ.పద్మరాణి, మండల విద్యాశాఖాధికారులు ఐ.విజయ్, బాలాజీ, డీసీఈబీ కార్యదర్శి షేక్ జాని సాహెబ్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి డి. చంద్రశేఖర్, నాయకులు పీవీఎస్డీ ప్రసాదు, పూజేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాలయ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ డెమొక్రటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో తమ విద్యార్థులు కబడ్డీ, ఖో-ఖో పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి వివిధ పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ తెలిపారు. సోమవారం విజేతలను ఆయన అభినందించారు. డైరెక్టర్ బొప్పన శాంతి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులు ఏవీ ?

మండవల్లి: ప్రధాన కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం-2005 బోర్డులు లేవని, కొన్ని చోట్ల ఉన్నా స్పష్టంగా కనిపించడం లేదని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్టాలిన్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు, కార్యవర్గ సభ్యుడు బి.రంగారావు ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



గుడివాడరూరల్: ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజావేదికలో గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన 25 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య పాల్గొన్నారు.

కోతుల బెడదకు చెక్

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో కొన్ని రోజులుగా కోతుల బెడద ఎక్కువై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్పందించిన సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ వీటి బెడద నివారించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా గ్రామం నుంచి కోతులను తరిమికొట్టేందుకు కొండముచ్చులను తిప్పుతున్నారు. వీటిని చూసిన కోతులు భయపడి పారిపోతున్నాయి.

సాక్షి సంతకమని పిలిచి.. ఆస్తి రాయించుకున్నారు

గుడ్లవల్లేరు: సాక్షి సంతకం చేసేందుకు పిలిచిన ఇద్దరు వ్యక్తులు, ఒక వీఆర్వో సహకారంతో తన ఆస్తి రాయించుకున్నారని ఓ బాధితుడి ఆవేదన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తోట సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. మండలంలోని కూరాడలో 1.64 ఎకరాల పొలం సుబ్రహ్మణ్యానికి ఉంది. తన మరదలతో పాటు మరొక వ్యక్తి సుబ్రహ్మణ్యం ఆస్తిలో 14 సెంట్లను కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. 2020లో తమ పొలం రిజిస్ట్రేషన్‌కు సాక్షి సంతకం పెట్టాలని నిందితులు ఇరువురూ సుబ్రహ్మణ్యాన్ని కోరారు. సాక్షి సంతకమే కదా... అని వెళ్లి పెట్టి వచ్చాడు. అంతే ఏడాది తర్వాత 2021లో ప్రభుత్వం జారీ చేసిన పాసు పుస్తకాల్లో సుబ్రహ్మణ్యం పొలం 14 సెంట్లు తగ్గి, 1.50 ఎకరాలే ఉండటాన్ని తన కుమార్తె విజయశ్రీ గమనించింది. దీంతో ఆ బాధిత కుటుంబం అధికారుల వద్దకు తిరిగినా ఫలితం లేదు. కేవలం ఈ రిజిస్ట్రేషన్ నిర్వాకం వెనుక ఒక వీఆర్వోకు పెద్ద మొత్తంలో నిందితులు ఇవ్వటంతో సమస్య తీరటం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

బైండ్ల సంక్షేమానికి కృషి

గుడ్లవల్లేరు: బైండ్ల కుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజులు అన్నారు. సోమవారం కూచికాయలపూడిలో తమ సంఘ వ్యవస్థాపకాధ్యక్షుడు మందపాటి పాపారావు ఆధ్వర్యంలో ఆ సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కొడాలి శరత్ చంద్రిక, జిల్లా ఉపాధ్యక్షుడిగా చీలి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొడాలి వేణుగోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడిగా కొడాలి నాగరాజు, మండల అధ్యక్షుడిగా కొడాలి బ్రహ్మం ప్రమాణ స్వీకారం చేశారు.

తహసీల్దార్‌కు మాతృ వియోగం

పామర్రు: పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్‌కు మాతృ వియోగం కలిగింది. తహసీల్దార్ తల్లి పార్వతి(74) మచిలీపట్నంలో ఉంటోంది. ఈమెకు సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను పరామర్శించారు.

సరికొత్త ట్రెండ్



- న్యూ ఇయర్ గిఫ్ట్‌లకు ఐసీడీఎస్‌లో చందాలు
- అంగన్‌వాడీల టీచర్లు, ఆయాలకు లేడీ బాస్‌ల హుకుం
- వసూలు చేస్తున్న సెక్టార్ లీడర్లు

గుడ్లవల్లేరు: స్త్రీ శిశు సంక్షేమ శాఖలో లంచావతారులు సరికొత్త ట్రెండ్‌ను అమలు చేసేందుకు తెర తీశారు. ఆ శాఖలోని లేడీ బాస్‌లకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేసి బహుమతులను ఇచ్చేందుకు చందాలను సేకరించాలని అధికారుల నుంచి హుకుం జారీ అయింది. ఈ వసూళ్ల బాధ్యతను సెక్టార్ల లీడర్లకు అప్పగించారు. ఈ వసూళ్లపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఇబ్బందులుపడుతున్నారు. సోమవారం ఈ వసూళ్లపై జరిగిన సమావేశంలో కొంతమంది అంగన్‌వాడీలు సెక్టార్ల లీడర్లకు ఎదురు తిరిగారు. తమ జీతాలు అంతంత మాత్రమేనని తెలిసిన సెక్టార్ల లీడర్లు కూడా అధికారులు ఆదేశిస్తే.. ఈ వసూళ్లకు ఎందుకు ఒప్పుకున్నారని నిలదీశారు. ఆ డబ్బులే ఉంటే.. తమ ఇంట్లోనే కొత్త సంవత్సరం పండగ చేసుకుంటాం కదా.. అని వాపోయారు. మేడమ్‌లపై సెక్టార్ లీడర్లకు అంత అభిమానం ఉంటే.. వారే ఆ న్యూ ఇయర్ గిఫ్ట్‌లను ఇచ్చుకోవాలని పేర్కొన్నారు.

రూ.లక్షల వసూలు

ఒక్కో అంగన్‌వాడీ టీచర్‌కు రూ.300, ఆయాకు రూ.200 చొప్పున బలవంతపు వసూళ్లు చేయటంపై బాధితులు ఆవేదనకు గురవుతున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని వందలాది అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.లక్షలను సెక్టార్ లీడర్లు వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్లను సెక్టార్ల లీడర్లు భుజాన వేసుకుని ఈ తంతును నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఒక్కసారే కాకుండా ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకుని ఇదే వసూళ్ల ప్రక్రియను రూ.లక్షల్లో వసూలు చేయటం పరిపాటిగా మారిపోయిందని బాధితులు వాపోతున్నారు. చివరకు ఐసీడీఎస్ కార్యాలయాల్లో స్వీపర్లకు కూడా ఇచ్చే జీతాలను అంగన్‌వాడీల నుంచే ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. స్వీపర్లకు నెల నెలా అంగన్‌వాడీల నుంచి జీతాల కింద ఒక్కొక్కరికి రూ.10 చొప్పున కూడా డబ్బు వసూలు చేస్తున్నారంటే.. వసూళ్ల మత్తు ఎంత తలకెక్కిందోనని బాధితులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలే లేవని చెబుతున్నారు. పట్టించుకోకపోగా వేధింపులకు తెర తీస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా తమ డబ్బులను వెనక్కి ఇచ్చేసి, మరొకసారి ఇలాంటి వసూళ్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను బాధితులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ బాలాజీ



పమిడిముక్కలలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డీకే బాలాజీ

పమిడిముక్కల: 'మీ కోసం'లో నమోదయ్యే అర్జీలకు నిర్దిత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమాన్ని పమిడిముక్కల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరించి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అమీనపురం, గురజాడ గ్రామానికి చెందిన భూ సమస్యలను రికార్డులలో పరిశీలించి పరిష్కారం చూపారు. పమిడిముక్కల సర్పంచ్ ముళ్లపూడి సునీత, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం పైడికొండల పాలెంలో శ్మశానవాటికకు భూసేకరణ చేయాలని, పమిడిముక్కల్లో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనానికి, పమిడిముక్కల్లోని స్త్రీశక్తి భవనానికి ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి పథక నిధులతో ఆరోగ్య కేంద్ర, స్త్రీశక్తి భవనాల వద్ద ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. శ్మశానవాటిక భూసేకరణకు కూడా నిధులు కేటాయిస్తామని తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డులనుంచి తొలగించాలని సూచించారు. జనవరిలో కొత్తగా రేషన్ కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గడువు తీరిన అర్జీలు ఏ స్థాయిలోనూ ఉండకూడదన్నారు. పరిష్కారం కానివాటికి తగిన కారణాలను అర్జీదారులకు వివరిస్తే వారిలో నమ్మకం కలుగుతుందన్నారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాస్, ఏఓ గణేష్‌రెడ్డి, ఏఈలు పృథ్వీరాజ్, శ్రీనివాసరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి



మాట్లాడుతున్న పామర్రు ఐసీడీఎస్ సీడీపీఓ భానుశ్రీ

పామర్రు: బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలోని అందరూ కృషి చేయాలని పామర్రు సీడీపీఓ వి.భానుశ్రీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక రుగ్మతగా మారిన బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రజలను చైతన్యవంతులుగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బాల్య దశ నుంచే యువతి ధరించే దుస్తులతో పాటు కుటుంబ కట్టుబాట్లకు అనుగుణంగా నడుస్తుంటే ఆడపిల్లలకు గౌరవం, హుందాతనం లభిస్తుందన్నారు. ఎంపీడీఓ జ్యోతి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అభ్యసించేలా చూడాలన్నారు. మండల వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు ప్రతిఒక్కరూ శారీరక ధారుడ్యం కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 పద్మవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందించిన ప్రిన్సిపాల్ ఎండీ రఫీ



విజేతలను అభినందించిన ఏఎస్ఎం ప్రిన్సిపాల్

జుఝవరం(పామర్రు): గుడివాడ డివిజన్ స్థాయిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని జుఝవరం ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ ఎండీ రఫీ పేర్కొన్నారు. సోమవారం విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ కబడ్డీ(బాలుర)లో ప్రథమ స్థానం సాధించారన్నారు. జూనియర్ లాంగ్ జంప్(బాలుర) విభాగంలో ద్వితీయ స్థానం, జూనియర్ కబడ్డీలో ప్రథమ స్థానం , జూనియర్ రన్నింగ్‌లో తృతీయ స్థానం, జూనియర్ గన్నీబ్యాగ్‌లో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. సీనియర్ త్రెడ్ అండ్ నీడిల్ బాలికల విభాగంలో ప్రథమ, తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. సీనియర్ బాలుర క్రికెట్ రన్నర్‌గా నిలిచారు.

ఏఎస్ఎం విద్యార్థుల ప్రతిభ

ఏపీ ప్రైవేట్ స్కూల్స్ డెమొక్రటిక్ అసోసియేషన్ గుడివాడ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో పామర్రు ఏఎస్ఎం విద్యార్థులు గెలుపొందారని ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రన్నింగ్ 100 మీటర్ల పందెంలో బాలికల విభాగంలో సబ్ జూనియర్స్ బి శ్రీలక్ష్మీ తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. జూనియర్స్‌లో ఈషన్వి ద్వితీయ స్థానం , జూనియర్స్ 200 మీటర్ల పరుగు పందెం సీనియర్స్ బాలికల విభాగంలో లక్ష్మీ తృతీయ స్థానం, బాలుర విభాగంలో సుధీర్ ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. ఖో-ఖో సీనియర్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. విజేతలైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ ప్రసన్నకుమార్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆటల పోటీలు ప్రారంభం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ ట్రోఫీ ఆటల పోటీలు సోమవారం స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో డీసీబీ సెక్రటరి షేక్ జాని సాహెబ్, ఎంఈఓ-2 బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పట్టణానికి చెందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్, వై.కిరణ్‌కుమార్, సీహెచ్ అప్పలస్వామి, ఎం. జయ ఆధ్వర్యంలో సోమవారం ఖో-ఖో, కబడ్డీ పోటీలు నిర్వహించామని తెలిపారు. వాలీబాల్, ఇతర అథ్లెటిక్స్ పోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలి

ముదినేపల్లి రూరల్: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ వీరభద్రరావు కోరారు. మంగళవారం రాత్రి సమయంలో వేడుకలను నిర్వహించుకునే వారు తగిన జాగ్రత్తలు తీసుకుని నిబంధనలు పాటించాలన్నారు. వీటిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలిగే రీతిలో కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, రోడ్లపై అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి



గుడివాడ టౌన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జనజాగరణ ప్రచార జాత పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూచౌక్ సెంటర్లో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడ కేంద్రంగా ఈ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కనకారావు, ఉపాధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, గౌరవాధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

గుడ్లవల్లేరు: విద్యారంగ పరిరక్షణే యూటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం యూటీఎఫ్ ప్రచార యాత్రను నిర్వహిస్తూ గుడ్లవల్లేరుకు ఆ సంఘ నాయకులు చేరుకున్నారు.

పేకాట శిబిరంపై దాడి

నందివాడ: మండలంలోని తుమ్మలపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసు సిబ్బంది సోమవారం మెరుపు దాడి చేశారు. ఎస్ఐ శ్రీనివాసు పర్యవేక్షణలో జరిగిన దాడిలో ఆరుగురు వ్యక్తుల నుంచి రూ.5,220లు, రెండు బైకులు, ఐదు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



చౌటపల్లి సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్

గుడివాడరూరల్: గ్రామాల్లో ఉన్న రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లిలో సోమవారం జరిగిన సదస్సులో ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ వెలగలేటి రమ్య, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండలంలోని లింగాలలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్వో రేగేశ్వరరావు, డీసీ చైర్మన్ నాగేశ్వరరావు, బోయిడి సురేష్ పాల్గొన్నారు.

ఆలయ భూములపై హక్కులు కల్పించండి

ముదినేపల్లి రూరల్: ఆలయాల భూములపై పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలని భూములు సాగు చేస్తున్న రైతులు పలువురు కోరారు. మండలంలోని వడాలి, కోమర్రు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు సోమవారం నిర్వహించారు. వడాలి జగన్నాథ స్వామి ఆలయానికి చెందిన భూములను అనేక సంవత్సరాలుగా సాగు చేస్తున్నప్పటికీ రైతులకు ఈ భూములపై ఎలాంటి హక్కులు లేవన్నారు. దీంతో గ్రామసభలో పాల్గొన్న రైతులు అర్జీల ద్వారా ఆలయ భూములపై హక్కులు కల్పించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సుల్లో అర్జీలను స్వీకరిస్తున్నామని తహసీల్దార్ బి.లోకరాజు పేర్కొన్నారు. సోమవారం చినగొన్నూరు సదస్సులో అర్జీలను అధికారులు స్వీకరించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తు వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్‌లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగం రచించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన చర్చలో అమిత్ షా వ్యంగ్య వ్యాఖ్యానం ప్రజాస్వామ్యవాదులను, అంబేద్కర్‌ను అవమానించడమేనన్నారు. ఇందుకు నిరసనగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు సోమవారం నిర్వహిస్తున్నామని అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, దళిత నాయకులు పొంగులేటి జయరాజు, జి. వర ప్రసాద్, ఎస్. రాంబాబు, వామపక్ష నాయకులు పి. రజిని. వీరమ్మ, అరుణ, వసంతరావు, ప్రకాష్, సత్యనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించడం దారుణం

పామర్రు: కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించడం దారుణమని బీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు పీ ప్రసాద్ అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అంబేద్కర్‌ను అవమానించిన హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి, ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ వామపక్షాలు, బహుజన సమాజ్‌వాదీ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యదర్శి గంగాధర ప్రసాద్, నాయకులు విల్సన్, వేము పెద బాబు, నాగభూషణం, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు భానుకుమార్, జార్జి ముల్లర్, రామనాథ్, రామారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని మొవ్వ మండల వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మొవ్వ మండలం కూచిపూడి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు ఉప్పాలపు వెంకటాద్రి, కాకి రాజశేఖర్, బొల్లా సుబ్రహ్మణ్యం, నాయకులు మద్దుల బసవరావు, పామర్తి కోటేశ్వరరావు, చిగురుపల్లి సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, బిల్డింగ్ కార్మికుడు దుర్గారావు, సీపీఐ నాయకులు అప్పారావు, నరసింహరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వికాసం, హక్కులపై అవగాహన



గుడివాడలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్



మొవ్వలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గుడివాడ టౌన్: బాలికల వికాసం, వారి హక్కులు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాజంలో అవగాహన ఉండాలని ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ అన్నారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళా మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కిషోరి వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో కొనసాగుతున్న లింగ వివక్షపై అవగాహన పెంచాలన్నారు. బాలికలకు బాలురతో సమానంగా హక్కులు కల్పించినా అవి అమలులో సాధ్యం కావడంలేదన్నారు. వీటిపై అవగాహన పెంచేందుకు ఐసీడీఎస్ అధికారులు ఈ విధమైన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ.విజయా ఫ్లారెన్స్, టూటౌన్ సీఐ నాగప్రసాదు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: ఆడ, మగ పిల్లల పట్ల వ్యత్యాసం చూపకుండా ఇద్దరినీ ఒకే రీతిలో పెంచాలని మొవ్వ ఎంపీడీఓ జె.వి మాదేవి సూచించారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కిషోర్ వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అలాగే కిషోర్ బాలికలు సైతం చదువుతోపాటు క్రీడల్లో నాయకత్వ లక్షణాల్లో నైపుణ్యం ప్రదర్శించి ఆదర్శవంతులుగా నిలవాలన్నారు. మొవ్వ క్లస్టర్ సూపర్‌జర్ ఏనుగు పుణ్యవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ మహిత, ఈఓ పీఆర్‌డీ ఎంఎస్‌కే పరమాత్మ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: కిషోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని ఎంపీడీఓ సీతామహాలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండల స్థాయి కిషోరి వికాసం కార్యక్రమాన్ని ఎంపీడీఓ జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివనాగమణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అతిగా ప్రవర్తిస్తే కేసులు

కైకలూరు: కొత్త ఆంగ్ల సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మంగళవారం రాత్రి చేసే వేడుకల్లో అతిగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ సోమవారం హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం తాగి రోడ్లుపై వాహనాలతో తిరగడం, అశ్లీల నృత్యాలు, ప్రమాదకరమైన బాణసంచా వినియోగం, రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, మ్యూజిక్ సిస్టం ఉపయోగించడం వంటివి నిషేధమని పేర్కొన్నారు. మద్యం తాగి నడిపిన వాహనాలు సీజ్ చేసి, రికార్డులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇటువంటి వారికి రూ.10,000 జరిమానా లేక ఆరు నెలల వరకు కారాగార శిక్ష, రెండూ విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

వేడుకలను విషాదం చేసుకోవద్దు

గుడ్లవల్లేరు: నూతన సంవత్సర వేడుకలను విషాదం చేసుకోకుండా ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ సోమవారం తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం తాగి అర్ధరాత్రి వరకూ రోడ్లపై తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టేడియం డైరీ ఆవిష్కరణ

గుడివాడ టౌన్: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం డైరీని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ఆవిష్కరించారు. స్టేడియం నూతన డైరీ ఆవిష్కరణ ఒక సంప్రదాయంగా ఇక్కడ కొనసాగించడం అభినందనీయం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వీఎల్‌కే వర ప్రసాద్, ఎం.లక్ష్మణరావు, డి.రవికుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను తెలయజేసేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ డి.రాజేష్ కుమార్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. సమస్యలు వివరించదలచినవారు 99592 25464లో సంప్రదించాలని కోరారు.

హుండీల కానుకల లెక్కింపు

పామర్రు: మండలంలోని పలు ఆలయాల్లోని హుండీలను సోమవారం లెక్కింపు చేసినట్లు పామర్రు గ్రూపు ఆఫ్ దేవాలయాల మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. పామర్రులోని విష్ణాలయం హుండీ కానుకలను లెక్కించగా రూ.6,200 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక పుట్లమ్మ సత్రంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ హుండీలో రూ.7,160, నెమ్మలూరులోని నాగేశ్వరస్వామి ఆలయం హుండీలో రూ.7,028 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవదాయ తనిఖీ అధికారిగా గుడివాడ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వ్యవహరించారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుళాయిల్లో కలుషిత నీరు

గుడివాడ టౌన్: పట్టణంలోని 16వ వార్డులో పలు ప్రాంతాల్లో కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సోమవారం తమ కుళాయిల ద్వారా వచ్చిన నీటిని సీసాలకు ఎత్తి వాటిని మీడియా దృష్టికి తెచ్చారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకున్నా మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని 16వ వార్డు ప్రజలు కోరారు.

వాసవీ విదర్భపురికి ఉత్తమ పురస్కారం

గుడివాడ టౌన్: వాసవీ క్లబ్ గుడివాడ అనుబంధ సంస్థ వాసవీ విదర్భపురికి 2024 ఉత్తమ సేవా అవార్డు దక్కినట్లు క్లబ్ అధ్యక్షురాలు చీదెళ్ల లక్ష్మి తెలిపారు. ఈ ఏడాది సేవలను పురస్కరించుకుని నాలుగు రీజినల్ స్థాయి, ఉత్తమ క్రియేటివ్‌లో 3-స్టార్ అవార్డులు పొందినట్లు పేర్కొన్నారు. అవార్డు పత్రాన్ని క్లబ్ సభ్యులు సోమవారం మీడియాకు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజినీ కుమారి, 2025 ప్రెసిడెంట్ చలువాది లక్ష్మీసురేఖ, సెక్రటరీ బోండా ఉమా నాగవల్లి, కోశాధికారి గోకవరపు రోహిణి, క్లబ్ సభ్యులు సుధారాణి, జ్యోతి, గిరిజ, విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

గుడ్లవల్లేరు: కూరాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, ప్యాడ్స్, పెన్నులు తదితర స్టేషనరీని సోమవారం అందించారు. పులి శాంతి బర్త్‌డేను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఆర్సీఎం చర్చి ఫాదర్ మ్యాథ్యూ చేతుల మీదుగా నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నందివాడ: మండల స్థాయిలో విద్యార్థులకు ఆటల పోటీలను స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించి సోమవారం విజేతలకు బహుమతులు అందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ కృష్ణవేణి, సీతయ్య, కొండలు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు త్రినాథ్, హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐకు అభినందన

పామర్రు: పామర్రు ఎస్ఐగా విధుల్లో చేరిన రాజేంద్రప్రసాద్‌ను పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ కలిసి సోమవారం అభినందించారు. కళా పీఠం సభ్యులు పాల్గొన్నారు.